
# మటన్ ఎక్కువగా తింటున్నారా!



మనలో ఎక్కువ శాతం మంది నాన్‌వెజ్ ప్రియులు ఉంటారు. వాళ్లకు ముక్క లేనిదే ముద్ద దిగదు. మూడు పూటు మాంసం పెట్టిన తినేస్తారు. ఒక్కరోజు వెజ్ కర్రీ వండితే..రోజు ఇదేనా అంటారు. అంతలా నాన్ వెజ్‌కి ఎడిక్ట్ అయిపోతారు. సాధారణ రోజులతో పోలిస్తే.. వీకెండ్ వచ్చిందంటే తప్పకుండా నాన్‌వెజ్ ఉండాల్సిందే. వీకెండ్‌లో నాన్‌వెజ్ లేకపోతే అసలు తిన్న ఫీలింగ్ కూడా ఉండదు. ఆకలి తీరడానికి తింటారు. కానీ ఇష్టంగా తినరు. అయితే నాన్‌వెజ్‌లో చాలామంది మటన్ ఎక్కువగా తింటారు. చికెన్ కంటే మటన్ తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని భావించి అధికంగా తింటారు. అయితే మటన్ తినడం వల్ల ఆరోగ్య ప్రయోజాలు ఉన్నాయి. కానీ షుగర్ ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. మటన్‌లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. అలాగే డయాబెటిస్‌కి కూడా కారణమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యానికి ఎంత మేలు చేసే పదార్థం అయిన కూడా లిమిట్‌లో మాత్రమే తినాలి. ఎక్కువగా తినడం వల్ల తప్పకుండా అనారోగ్య సమస్యలను ఎదుర్కొవలసి వస్తుంది. మటన్ తినడం వల్ల ప్రొటీన్లు శరీరానికి పుష్కలంగా అందుతాయి. ఇందులో ఉండే పోషకాలు శరీరానికి బలాన్ని ఇస్తుంది. కానీ ఎక్కువ సార్లు మటన్ తినడం వల్ల అనారోగ్య సమస్యల బారిన పడటం తప్పనిసరి. అధికంగా మటన్ తింటుంటే.. టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మటన్ తినని వాళ్లతో పోలిస్తే.. తినే వాళ్లలో డయాబెటిస్ ముప్పు ఎక్కువగా ఉన్నట్లు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. దాదాపు పదేళ్లుగా మటన్ అధికంగా తినే వాళ్లను పరిశీలించారు. వారానికి ఒకసారి తినే వాళ్లలో ఎలాంటి ప్రమాదం లేదని అంతకు మించి ఎక్కువసార్లు తినే వాళ్లలో టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఉందని పరిశోధనలో తేలింది. మటన్ తినే వాళ్లలో డయాబెటిస్ టైప్ 2 వచ్చే అవకాశాలు 15 శాతం ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. మటన్‌లో హానికారిక శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి సహజ ఇన్సులిన్ విడుదలను అడ్డుకుంటాయి. ఎక్కువ సార్లు మటన్ తినడం వల్ల శరీరానికి తక్షణమే శక్తి లభిస్తుంది. ఆరోగ్యంగా ఉంటామనే అపోహాలో ఎక్కువగా తినవద్దు. కాస్త లిమిట్‌లో మాత్రమే తినాలి. ఈరోజుల్లో ఫుడ్ ఎక్కువగా ప్యాకింగ్‌లో నిల్వ ఉన్నది లభిస్తుంది. తాజాగా దొరకడం కష్టం అవుతుంది. ఇలా ప్యాకేజ్డ్ ఉన్న మటన్ అధికంగా తినడం వల్ల డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఇంకా ఎక్కువగా ఉంటుంది. నాన్ వెజ్ తినాలని అనిపిస్తే చేపలు తినడం మంచిది. వీటి వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయి. ఏ ఆహారాన్ని తీసుకున్న తాజాగా ఉండేవి తీసుకోవడం మేలు. ఇలా ప్యాకేజ్డ్ ఉన్న ఆహారాలు తీసుకోవడం వల్ల ఏదో ఒక అనారోగ్య సమస్యల బారిన పడతారు. కాబట్టి నిల్వ చేసిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండండి. అలాగే మటన్ తినడం కాస్త తగ్గించండి. వారానికి ఒకసారికి మించి ఎక్కువగా తినకండి.

# బొంగురు మాటలు.. స్వరపేటిక క్యాన్సర్‌కు దారితీయొచ్చు?




వయసుతో సంబంధం లేకుండా ప్రస్తుత రోజుల్లో చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. క్యాన్సర్ అనేది ప్రాణాంతక వ్యాధి. ఈ వ్యాధి సోకిన వారు చాలా వరకు ప్రాణాలు కోల్పోతున్నారు.నాన్ స్టాప్‌గా దగ్గడం, ఊపిరి ఆడకపోవడం, వాంతులవ్వడం, మింగడంలో ఇబ్బంది పడడం, మూత్రంలో బ్లడ్ పడడం, అజీర్ణం లేదా గుండెల్లో మంట, ఆకలి లేకపోవడం, సడన్‌గా వెయిట్ లాస్ అవ్వడం, రాత్రుళ్లు ఎక్కువ చెమట పట్టడం, మూత్ర విసర్జన సమయంలో ఇబ్బంది పడడం, గొంతు నొప్పి పెట్టడం, ముక్కు నుంచి రక్తం కారడం వంటివి క్యాన్సర్ లక్షణాలు. ఈ క్యాన్సర్ 75 శాతం పొగాకు తీసుకునే వారిలో వస్తుందని నిపుణులు గుర్తించారు. అలాగే అధిక బరువు ఉన్నవారికి, అధికంగా మద్యం తీసుకోవడం వల్ల, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల కారణంగా క్యాన్సర్ వస్తుందని చెబుతున్నారు. అయితే ఒక నెలరోజుల పాటు గొంతు నొప్పి, మాట్లాడుతుంటే బొంగురు లాగా అనిపిస్తే మాత్రం అది స్వరపేటిక క్యాన్సర్ కు దారితీయొచ్చునని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం లక్షకు పైగా క్యాన్సర్ బారిన పడుతున్నారని.. కాగా ముందుగానే క్యాన్సర్ లక్షణాల్ని గుర్తించి వైద్యుల్ని సంప్రదించాలని నిపుణులు జనాలకు సూచిస్తున్నారు. స్వరపేటిక క్యాన్సర్ వచ్చిన వారు తీవ్రమైన అలసటకు గురవుతారు. విపరీతంగా గొంతు నొప్పి ఏర్పడుతుంది. నాన్ స్టాప్‌గా దగ్గుతూనే ఉంటారు. మాట సరిగ్గా రాదు. బొంగురుగా వస్తుంది. మాట్లాడుతుంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. వీటికి తోడుగా చెవినొప్పి వస్తుంది. ఊపిరి పీల్చుకున్నప్పుడు గురక కూడా వస్తుంది. అకస్మాత్తుగా బరువు తగ్గుతారు. ఈ స్వరపేటిక క్యాన్సర్ ఎక్కువగా 60 ఏళ్లు పైబడిన వారిలోనే వస్తుంది. అందులో ఆడవాళ్లలో కంటే పురుషుల్లో ఎక్కువగా వస్తుంది. కాగా దీన్ని తొందరగా గుర్తిస్తే వ్యాధి నుంచి బయటపడే చాన్స్ ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# రాత్రిపూట పెరుగు తింటున్నారా?



చాలా మందికి పెరుగు అంటే ఇష్టముంటుంది. కొందరైతే పెరుగు లేనిదే అన్నం తినరు. అన్నం చివరన పెరుగు లేకుండా.. భోజనం ముగించరు. ఇక పెళ్లిలు, ఫంక్షన్లకైతే పెరుగు ఉండాల్సిందే. అయితే చాలా మంది మధ్యాహ్నంతో పాటు రాత్రి కూడా పెరుగు తింటారు. మధ్యాహ్నం తింటే మంచిదే కానీ రాత్రి తింటే సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మరి రాత్రి పూట కర్డ్ తినడం వల్ల కలిగే సమస్యలు ఏంటో ఇప్పుడు మనం చూద్దాం.. నిద్రకు భంగం: రాత్రిపూట పెరుగు తినడం వల్ల మీ నిద్రకు భంగం కలుగుతుంది. పెరుగులో ఉండే టైరమైన్ మీ మెదడును ఉత్తేజపరుస్తుంది. దీని కారణంగా త్వరగా నిద్ర పట్టక ఇబ్బంది పడాల్సి వస్తుంది. నిద్రలేమి వల్ల అనేక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది.బరువు తగ్గాలనుకునేవారు: పెరుగు శరీరానికి ప్రొటీన్లను అందించే అద్భుతమైన ఆహారం. అయితే, ఇందులో కొవ్వు కూడా ఉంటుంది. రాత్రిపూట మీ శారీరక శ్రమ తక్కువగా ఉంటుంది. శారీరక శ్రమ లేనప్పుడు దీన్ని తినడం వల్ల ఆ కొవ్వులు శరీరంలో నిల్వ ఉంటాయి. ఇలా బరువు తగ్గాలనుకునే వారు రాత్రిపూట పెరుగు తినకుండా ఉండాలి. దగ్గు, జలుబు సమస్యలు ఉన్నవారు: మీరు దగ్గు లేదా జలుబుతో బాధపడుతుంటే రాత్రి వేళ పెరుగు అస్సలు తినకూడదు. అలాగే రాత్రిపూట పెరుగు తీసుకుంటే చాలా మందికి జీర్ణ సమస్యలు వస్తుంటాయి. కడుపు ఉబ్బరంగా ఉంటుంది. కడుపులో గ్యాస్ ఏర్పడవచ్చు. దీనికి ప్రధాన కారణం పెరుగులో ఉండే చక్కెర సమ్మేళనం అయిన లాక్టోస్‌ను కొంతమంది శరీరాలు అంగీకరించకపోవడమే. దీన్నే 'లాక్టోస్ ఇంటాలరెన్స్' అంటారు. ముఖ్యంగా వయసు పెరిగేకొద్దీ, మన శరీరం లాక్టేజ్ ఎంజైమ్ ఉత్పత్తిని తగ్గిస్తుంది, ఇది లాక్టోస్ అసహనానికి దారితీస్తుంది. ఫ్రిజ్‌లో పెట్టిన పెరుగు: రాత్రి పూట ఫ్రిజ్‌లో పెట్టిన పెరుగు తింటే మాత్రం జలుబు చేసే అవకాశాలున్నాయి. అలాగే నైట్ టైమ్‌లో కర్డ్ తినడం వల్ల గొంతులో కఫం ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ తప్పనిసరిగా పెరుగు తినాల్సి వస్తే.. పలుచగా మజ్జిగ లాగా చేసుకొని తాగడం మంచిదని సూచిస్తున్నారు. కీళ్ల నొప్పులు: కీళ్ల నొప్పులతో బాధపడేవారు రోజూ పెరుగు తినడం ఆరోగ్యానికి మంచిది కాదు. ఎందుకంటే కీళ్ల దృఢత్వం, నొప్పులు పెరుగుతాయని చెబుతారు. అయితే ఇప్పటికే ఆర్థరైటిస్ ఉన్నవారు పెరుగును తినడం తగ్గించాలి.

# ఈ ఆహారం గర్భిణీలకు ఒక వరం..



ప్రతి తల్లి తనకు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలని కోరుకుంటుంది. కానీ ఈ మధ్యకాలంలో పిల్లలను ఎంత ఫిట్ గా ఉంచాలనుకున్నా, మంచి సంరక్షణ ఉన్నప్పటికీ చిన్నతనం నుండే పిల్లల్లో ఊబకాయం పెరగడం ప్రారంభమవుతుంది. దీన్నే చిన్ననాటి ఊబకాయం అని పిలుస్తారు. ఈ ఊబకాయం మధుమేహం, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులకు కారణమవుతుంది. గర్భధారణ సమయంలో మహిళలు తినే వస్తువులు పిల్లల బరువును కూడా ప్రభావితం చేస్తాయని నిపుణులు భావిస్తున్నారు. అందుకే మహిళలు తమ ఆహారం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ప్రెగ్నెన్సీ సమయంలో మెడిటరేనియన్ డైట్ పాటించడం వల్ల పిల్లల్లో చిన్ననాటి ఊబకాయాన్ని నివారించవచ్చని తాజా అధ్యయనం సూచిస్తుంది. ఈ అధ్యయనం ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఒబేసిటీలో ప్రచురించింది. మెడిటరేనియన్ డైట్ పాటించే స్త్రీలకు పుట్టే పిల్లలకు ఊబకాయం వచ్చే అవకాశం కేవలం 6 శాతం మాత్రమే ఉందని తేలింది. మధ్యధరా ఆహారం.. ఇది మొక్కల ఆధారిత ఆహారం. ఇందులో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, చిక్కుళ్ళు ఎక్కువగా తీసుకుంటారు. ఈ కాలంలో మీరు రెడ్ మీట్‌ను నెలలో 2 నుండి 3 సార్లు మాత్రమే తినవచ్చు. ఈ ఆహారంతో వ్యాయామం చేయడం ముఖ్యం. నూనె, నెయ్యి లేదా వెన్నకు బదులుగా, ఆలివ్ లేదా కనోలా నూనెను ఉపయోగించాలి. ఆహారంలో రుచి పెరగాలంటే ఉప్పు తక్కువగా, మూలికలను ఎక్కువగా వాడతారు. గర్భధారణ సమయంలో మధ్యధరా ఆహారం ప్రయోజనాలు... మెడిటరేనియన్ ఆహారంలో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. గర్భిణీ స్త్రీలు ఈ ఆహారాన్ని అనుసరిస్తే, పిల్లలు యుక్తవయస్సు వరకు ఊబకాయం నుంచి సురక్షితంగా ఉంటారు. గర్భధారణ సమయంలో మధ్యధరా ఆహారం తీసుకోవడం వల్ల గర్భధారణ మధుమేహం వచ్చే ప్రమాదం కేవలం 35% తగ్గుతుంది. అలాగే కడుపులో పిల్లల బరువు కూడా తక్కువగా ఉంటుంది. మధ్యధరా ఆహారం తీసుకోవడం ద్వారా, గర్భం ఆరోగ్యంగా ఉంటుంది. బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుంది. ఈ రకమైన ఆహారంలో ఆకుపచ్చ కూరగాయలను చేర్చడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఇందులో ఫోలిక్ యాసిడ్ ఉంటుంది. ఇది పుట్టుకతో వచ్చే లోపాలను నివారించడానికి అవసరం. గర్భధారణ సమయంలో మెడిటరేనియన్ డైట్‌ని అనుసరించడం వల్ల రెండు సంవత్సరాల వయస్సులో పిల్లల అధిక బరువు లేదా ఊబకాయం వచ్చే అవకాశాలను గణనీయంగా తగ్గిస్తుందని అధ్యయనం తెలిపింది. అంతే కాదు శిశువు అనేక ఇతర వ్యాధుల నుంచి కూడా రక్షించబడుతుంది. మధ్యధరా ఆహారం సమతుల్య ఆహారం. ఇందులో ఎక్కువగా పండ్లు, కూరగాయలు, బీన్స్, బ్రౌన్ రైస్, ఆలివ్ ఆయిల్, చిక్కుళ్ళు, గింజలు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. వీటిని తీసుకోవడం ద్వారా గర్భిణికి విటమిన్లు, పోషకాలు పుష్కలంగా అందుతాయి. ఈ ఆహారాన్ని అనుసరించేటప్పుడు, ప్రాసెస్ చేసిన మాంసం, స్వీట్లు, తీపి పానీయాలకు దూరంగా ఉండాలి. బాల్య ఊబకాయం ప్రపంచవ్యాప్తంగా నెలకొని ఉన్న తీవ్రమైన ఆరోగ్య సమస్య. భారతదేశంలో చిన్ననాటి ఊబకాయంతో బాధపడుతున్న పిల్లల సంఖ్య 2022 నాటికి 2.5 కోట్లుగా అంచనా వేశారు. బాల్య స్థూలకాయానికి చాలా కారణాలు ఉన్నప్పటికీ, గర్భిణీ ఆహారం కూడా ఇందులో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందంటున్నారు నిపుణులు. గర్భధారణ సమయంలో పోషకాహారం లోపించిన మహిళల పిల్లలు 2 నుంచి 4 సంవత్సరాల వయస్సులో ఊబకాయం చెందడం ప్రారంభిస్తారు. అందుకే తల్లి పోషణ నాణ్యతను మెరుగుపరచడం చాలా ముఖ్యం.





# ఊహించిన దాని కంటే పెద్ద హిట్

శ్రీ సింహా కోడూరి, సత్య లీడ్ రోల్స్‌లో రితేష్ రానా దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం 'మత్తువదలరా2ః. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించారు. ఈనెల 13న విడుదలైన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షుకులను అలరించి, సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ నిర్వహించిన బ్లాక్ బస్టర్ ప్రెస్‌మీట్‌లో హీరో శ్రీ సింహ మాట్లాడుతూ,'మేము ఎక్స్‌పెక్ట్ చేసిన దాని కంటే సినిమా పెద్ద హిట్ అయినందుకు చాలా హ్యాపీగా ఉంది. పార్ట్ 3 కోసం మీలానే నేనూ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నాను' అని తెలిపారు. డైరెక్టర్ రితిష్ రానా మాట్లాడుతూ, 'సినిమా చూసి ఇంత గొప్పగా ఆదరించిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు' అని తెలిపారు. 'ఈ సినిమాని ఇంత పెద్ద స్థాయిలో ఆదరించిన ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు. ప్రేక్షకులందరూ చాలా పెద్ద హిట్ చేశారు. మీడియా చాలా మంచి రివ్యూస్ ఇచ్చారు' అని నిర్మాత చెర్రీ చెప్పారు. మరో నిర్మాత వై రవిశంకర్ మాట్లాడుతూ,'సినిమాని ఊహించిన దాని కంటే పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్'. దసరా సెలవుల్లో కూడా ఈ రన్ కంటిన్యూ అవుతుందని భావిస్తున్నాం. ఇప్పటివరకు మొత్తంగా రూ.30.1 కోట్ల గ్రాస్‌ని కలెక్ట్ చేసింది' అని అన్నారు.

# కొత్త పీపుల్స్ స్టార్ వచ్చాడు

టాలీవుడ్లో చాలామంది హీరోలకు పేర్ల వెనుక 'ట్యాగ్స్' ఉన్నాయి. అందులో కొన్ని అభిమానులు ఇచ్చినవి అయితే.. కొన్ని ఆ హీరోలను ఇష్టపడే దర్శకులు, నిర్మాతలు పెట్టినవి.కొందరు హీరోలు సొంతంగా తమకు తాము ట్యాగ్స్ ఇచ్చుకున్న వాళ్లు కూడా ఉన్నారు. ఆ సంగతలా ఉంచితే సాధారణంగా ఒక హీరోకు ఉన్న ట్యాగ్‌ను ఇంకొకరు వాడుకోరు. సూపర్ స్టార్, పవర్ స్టార్ లాంటి ట్యాగ్స్‌ను వేర్వేరు ఇండస్ట్రీల్లో వేర్వేరు హీరోలకు వాడుతుంటారు కానీ.. ఒకే ఇండస్ట్రీలో ఒక హీరో ట్యాగ్‌ను ఇంకొకరు వాడుకోవడం అరుదు. తండ్రి నుంచి వారసత్వంగా తీసుకున్నవి తప్ప. కానీ ఇప్పుడో యువ కథానాయకుడు.. ఓ సీనియర్ నటుడి బిరుదును తీసి తన పేరు పక్కన పెట్టేసుకున్నాడు. అతనే సందీప్ కిషన్. తన కొత్త చిత్రం 'మజాకా' టైటిల్, ఫస్ట్ లుక్‌ను ఈ రోజే రివీల్ చేశారు. ఇప్పటిదాకా సందీప్‌కు ట్యాగ్ అంటూ ఏమీ లేదు. కానీ ఈ సినిమా పోస్టర్లో మాత్రం 'పీపుల్స్ స్టార్' అని వేసేశారు. టాలీవుడ్లో పీపుల్స్ స్టార్ అనగానే అందరికీ ఆర్.నారాయణమూర్తి గుర్తుకు వస్తారు. పేదల పక్షం వహిస్తూ కమ్యూనిజం నేపథ్యంలో ఒకప్పుడు ఆయన తీసిన ఎర్రసైన్యం, ఒరేయ్ రిక్షా లాంటి చిత్రాలు సెన్సేషన్ క్రియేట్ చేశాయి. ప్రజల కోసం చిత్తశుద్ధితో సినిమాలు తీసే ఆయనకు అభిమానులు 'పీపుల్స్ స్టార్' బిరుదును కట్టబెట్టారు. ఆయన కూడా తన సినిమాల పోస్టర్లు, టైటిల్స్‌లో ఆ 'ట్యాగ్'ను వాడుకున్నారు. ఐతే నారాయణమూర్తి కొన్నేళ్ల నుంచి సినిమాలు తీయట్లేదు. దాదాపుగా రిటైరైపోయారు. ఐతే ఇప్పుడు సందీప్ ఈ ట్యాగ్‌ను తీసేసుకున్నాడు. ఐతే నారాయణమూర్తికి ఉన్న ఇమేజ్‌కు, సందీప్‌కు ఉన్న గుర్తింపుకి పొంతన లేదు.






## తల్లీ కూతుళ్ల సెంటిమెంట్‌తో గోపీచంద్ విశ్వం సెకండ్ సింగిల్

టాలీవుడ్ యాక్టర్ గోపీచంద్ శ్రీను వైట్ల కాంబినేషన్‌లో వస్తోన్న చిత్రం విశ్వం 32గా వస్తోన్న ఈ మూవీ నుంచి ఇప్పటికే ఫస్ట్ సింగిల్ మొరాకన్ మగువను విడుదల చేయగా.. సూపర్ స్టైలిష్‌గా సాగుతున్న పాట మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది. తాజాగా ఈ మూవీ నుంచి మొండితల్లి పిల్ల నువ్వు సాంగ్ విడుదల చేశారు. శ్రీహర్ష ఎమని రాసిన ఈ పాటను ఈ పాటను చేతన్ భరద్వాజ్ కంపోజిషన్‌లో సాహితి చాగంటి పాడింది. తల్లీకూతుళ్ల సెంటిమెంట్‌తో సాగనున్నట్టు లిరికల్ వీడియోతో క్లారిటీ ఇచ్చేశాడు శ్రీనువైట్ల. ఇప్పటికే లాంచ్ చేసిన జర్నీ ఆఫ్ విశ్వం వీడియో ఫన్, సీరియస్ ఎలిమెంట్స్‌తో సాగుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. ఈ మూవీలో కావ్యథాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. చేతన్ భరద్వాజ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్న ఈ మూవీకి గోపీమోహన్ స్క్రీన్ ప్లే సమకూరుస్తున్నాడు. ఈ మూవీని చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై పాపులర్ డిస్ట్రిబ్యూటర్ కమ్ ఎగ్జిబిటర్ వేణు దోనెపూడి పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి తెరకెక్కిస్తున్నారు. గింజ గింజపై తినేవాడి పేరు రాసి ఉంటుంది. దీనిపై నా పేరు ఉంది.. అని ఫస్ట్ స్ట్రైక్‌లో గోపీచంద్ చెబుతున్న డైలాగ్స్ సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రంలో నరేశ్, ప్రగతి, వెన్నెల కిశోర్, షకలక శంకర్, అజయ్ ఘోష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



## సుధీర్ బాబు సూపర్ నేచురల్ థ్రిల్లర్

సుధీర్ బాబు కథానాయకుడిగా రూపొందుతోన్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'జటాధర'. అనౌన్స్‌మెంట్ నుంచి పాన్ ఇండియా సినీ ప్రేక్షకులను ఆకట్టుకుని భారీ అంచనాలు క్రియేట్ చేసుకున్న ఈ చిత్రం 2025 శివరాత్రి విడుదలకు సన్నద్ధమవుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా నుంచి విడుదలైన కొత్త పోస్టర్ సినిమాపై ఎక్స్‌పెక్టేషన్స్‌ను మరింతగా పెంచుతోంది. పౌరాణిక, ఫాంటసీ, డ్రామా అంశాల కలయికగా ఈ చిత్రం తెరకెక్కుతోందని విడుదలైన పోస్టర్ చూస్తుంటేనే అర్థమవుతుంది. అలాగే అందులో సుధీర్ బాబు సరికొత్త లుక్‌తో, శక్తివంతమైన పాత్రలో కనిపించబోతున్నారని తెలుస్తుంది. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్ బాబు ప్రొడక్షన్ బ్యానర్‌పై జటాధర చిత్రం ఇండియన్ సినిమాల్లో ఓ బెంచ్ మార్క్‌ను క్రియేట్ చేసేలా రూపొందుతోంది. సుధీర్ బాబు మాట్లాడుతూ "జటాధర' ఫస్ట్ లుక్ పోస్టర్‌కు వచ్చిన ఆదరణ చూసి ఆశ్చర్యపోయాను. ఇంత గొప్ప స్పందన రావడంతో సంతోషమేసింది. ఆ సంతోషాన్ని మాటల్లో చెప్పలేను. ఈ సినిమాలోకి అడుగు పెట్టటం అనేది ఓ సరికొత్త ప్రపంచాన్ని నాకు పరిచయం చేసింది. నాకు ఇది ఎప్పటికీ మరచిపోలేని అనుభవం. శాస్త్రీయత, పౌరాణిక అంశాల కలయిక స్క్రిప్ట్‌ను రాశారు. ఈ రెండు జోనర్స్‌కు చెందిన ప్రపంచాలను రేపు ఆడియెన్స్ వెండితెరపై చూస్తున్నప్పుడు ఓ సరికొత్త సినిమా అనుభూతిని పొందుతారు. ఓ సినిమా సక్సెస్‌కైనా కారణం బలమైన స్క్రిప్ట్. దీనికి మంచి టీమ్ తోడైతే అది మంచి సినిమాగా ప్రాణం పోసుకుంటుంది. మా సినిమా విషయంలో అదే జరుగుతుంది. ప్రేరణ అరోరా బెస్ట్ టీమ్‌తో జటాధర సినిమాను ఆవిష్కరిస్తున్నారు. విజువల్‌గా, ఎమోషనల్‌గా ఓ అద్భుతమైన సినిమాను ఆమె తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి సంబంధించిన సెకండ్ పోస్టర్ పౌరాణిక ప్రపంచాన్ని తెలియజేస్తుంది. ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా ఉండే అంశాలు ఎన్నో ఈ సినిమాలో ఉండబోతున్నాయి. వాటి గురించి తెలియజేయటానికి, ప్రేక్షకులు ఈ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను ఎలా ఎంజాయ్ చేస్తారో చూడాలని నేను ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నాను" అన్నారు. భారీ బడ్జెట్‌తో అంచనాలను మించేలా ఓ అద్భుతమైన సరికొత్త చిత్రాన్ని రూపొందించటానికి నిర్మాతలు ప్రేరణ అరోరా, శివివన్ నారంగ్, నిఖిల్ నంద, ఉజ్వల్ ఆనంద్ అహర్నిశలు కష్టపడుతున్నారు. సినిమాలో హీరోయిన్‌గా ఓ ప్రముఖ బాలీవుడ్ స్టార్ హీరోయిన్ నటించనుంది. అలాగే ప్రతినాయకి పాత్రలో బాలీవుడ్ స్టార్ నటించనుంది. ఆ వివరాలను మేకర్స్ త్వరలోనే ప్రకటించనున్నారు. ప్రస్తుతం జటాధర సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. హరోంహరతో సూపర్ హిట్ కొట్టిన సుధీర్ బాబు అక్టోబర్ 11న 'మా నాన్న' సూపర్ హీరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110